క్లుప్తంగా

మంత్రిని కలిసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, భీంపూర్ జెడ్పీటీసీ కొమ్ర సుధాకర్‌లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బోథ్ మండలానికి రూ.50 లక్షలు, నూతనంగా ఏర్పడిన సొనాల మండలానికి రూ. 50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల విరాళం

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి పాఠశాల పూర్వ విద్యార్థి రూ.4వేల విలువ గల పుస్తకాలు అందజేశారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి పాటిల్ నాగోరావు ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా గ్రంథాలయం కోసం తనవంతుగా పుస్తకాలను విద్యార్థుల కోసం హెచ్‌ఎం శ్రీకాంత్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్, శ్రీనివాస్, సంతోష్, ఉమా మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'డీసీసీ పదవి ఎస్సీలకు ఇవ్వాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: డీసీసీ జిల్లా అధ్యక్ష పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి ఇవ్వాలని పార్టీ జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న ఎస్సీ సామాజికవర్గానికి ఇస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్, డొవలే ప్రశాంత్, ప్రకాష్, దయానంద్, సుదోధన్, నవీన్, ఉమేష్ పాల్గొన్నారు.

భీంపూర్ ఎస్సైగా ప్రదీప్‌కుమార్

తాంసి: భీంపూర్ ఎస్సైగా ప్రదీప్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలో భాగంగా భీంపూర్ ఎస్సైగా పనిచేస్తున్న లాల్ సింగ్ నాయక్‌ను ఆదిలాబాద్ 2 టౌన్‌కు బదిలీ చేశారు. ఆదిలాబాద్ 2టౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్‌ను భీంపూర్ ఎస్సైగా బదిలీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు ఏప్రిల్ 28లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ ఒక ప్రకటనలో తెలిపారు. మే 17న పాలిసెట్ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ మూడేళ్ల డిప్లొమో కోర్సుల్లో 60 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో టౌన్-3 ఫీడర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్, ద్వారకానగర్, బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈవిషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని క్రాంతికార్ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటీవ్ సొసైటీ జిల్లా అడ్వైజర్ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న లేబర్‌లను కాకుండా స్థానికంగా హమాలీలకు పని కల్పించాలన్నారు. ప్రతీ హమాలీ కార్మికుడికి లేబర్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వాహనాలకు పార్కింగ్ పరేషాన్



ఫిల్టర్‌బెడ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

- ఫిల్టర్ బెడ్‌లో నిలుపుతున్న వైనం
- స్థల కేటాయింపుపై దృష్టి సారించని బల్దియా
- ఎండకు ఎండుతూ, వానకు తడవాల్సిన దుస్థితి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియాకు సంబంధించిన పారిశుధ్య వాహనాలకు పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. ప్రత్యేక పార్కింగ్ స్థలమంటూ లేకపోవడంతో వాహనాలను ఫిల్టర్‌బెడ్‌లో నిలుపుతున్నారు. అక్కడ షెడ్‌లాంటి ఏర్పాట్లు లేకపోవడంతో వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. దీంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించేలా చర్యలు చేపట్టాల్సిన బల్దియా యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించకపోవడం సమస్యకు కారణమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పార్కింగ్ స్థలం కరువు..

గ్రేడ్-1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాల్టీ పరిధిలో 49 వార్డులున్నాయి. ఆయా కాలనీల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఇంటింటికీ వెళ్లి సేకరించేందుకు బల్దియా ప్రత్యేక వాహనాలను కలిగి ఉంది. డ్రెయినేజీలను శుభ్రపరిచిన సమయంలో ఏర్పడే చెత్త కుప్పలతో పాటు రోడ్లపై ఉండే వ్యర్థాలను తరలించేందుకు 16 ట్రాక్టర్లున్నాయి. అలాగే రెండు టిప్పర్లు సైతం అందుబాటులో ఉన్నాయి. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేందుకు 48 ట్రాలీ ఆటోలను నడుపుతున్నారు. వీటితో పాటు పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఫాగింగ్ మిషన్ ఆటోలు 2, ఫాగింగ్ ఆటోమిషన్ 1, ట్రాక్టర్ డోజర్ 1, రోడ్డు స్వీపింగ్ మిషన్ 1 చొప్పున ఉన్నాయి. అయితే వీటిని నిలిపేందుకు పార్కింగ్ స్థలమంటూ ప్రత్యేకంగా లేదు. ఇది వరకు ఈ వాహనాలను మున్సిపల్ కార్యాలయం ఎదుట వాటర్ ట్యాంక్ ఖాళీ ప్రాంతంలో నిలిపేవారు. అయితే తాజాగా ఆస్థలంలో నూతన కార్యాలయ భవనం నిర్మించడంతో అక్కడ నిలిపేందుకు అవకాశం లేకుండా పోయింది.

ఫిల్టర్‌బెడ్‌లో నిలుపుదల

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలమంటూ లేకపోవడంతో వాటిని పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్రాంతమైన ఫిల్టర్‌బెడ్‌లో నిలుపుతున్నారు. ఇది మున్సిపాల్టీకి సంబంధించిన స్థలమే అయినప్పటికీ ఇది వరకు అక్కడున్నటువంటి పచ్చదనం, వాటర్ ఫౌంటేన్‌లు వాహనాల నిలపుదలతో కనుమరుగయ్యాయి. వాహనాలకు షెడ్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనాలు మరమ్మతులకు గురై త్వరగా చెడిపోయే అవకాశం ఉంది. భవిష్యత్‌లో తాగునీటి పరంగా ఫిల్టర్‌బెడ్ అభివృద్ధితో పాటు కొత్తగా నిర్మాణాలు చేపట్టాల్సి వస్తే పరిస్థితేంటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మున్సిపల్‌కు సంబంధించిన కోట్లాది రూపాయాల విలువైన లీజు స్థలాలు, అసైన్డ్ భూములు కబ్జాలకు గురయ్యాయి. వాటిల్లో వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించే అవకాశమున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆదిశగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

'బీసీ కులాలకు మంచి రోజులు'



మాట్లాడుతున్న చిక్కాల దత్తు

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీ కులాలకు మంచి రోజులు వస్తున్నట్లు తాము భావిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2014 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించడం జరిగిందని, కానీ సర్వే నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయకపోవడం శోచనీయమన్నారు. గత కొన్నేళ్ల నుంచి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీల కులగణన చేయాలని ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం స్పందించలేదన్నారు. అప్పటి పోరాటాల ఫలితంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన బిల్లును శాసనసభలో తీసుకురావడం జరిగిందన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం పాఠశాలకు ఉపాధ్యాయుడి కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రీతమ్

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు డిప్యూటేషన్‌పై అదనంగా ఉపాధ్యాయుడిని కేటాయించారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా మండలంలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు సరైన బోధన అందని పరిస్థితి నెలకొంది. ఈనెల 5న సాక్షి దినపత్రికలో 'వేధిస్తున్న టీచర్ల కొరత' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖ అధికారులు ఈనెల 6న వడూర్ ప్రాథమిక పాఠశాలకు కమట్‌వాడ పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడిని కేటాయించారు. అలాగే అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలకు మండలంలోని భగవాన్‌పూర్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రీతమ్ అనే ఉపాధ్యాయుడిని శనివారం డిప్యూటేషన్‌పై కేటాయించారు. విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు బోధించారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు



లలితను సన్మానిస్తున్న జైలు సూపరింటెండెంట్ అశోక్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎండీ.ఖమర్ అహ్మద్‌ను కాంగ్రెస్ మైనార్టీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎంఏ షకీల్, షేక్ ఖలీం, న్యాయవాది అఫ్రోజ్, మొహమ్మద్ రఫీక్, సయ్యద్ షాహిద్ అలీ, నజీమ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘ నాయకులు సైతం కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేశ్, నానాయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డు లలితను శనివారం జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్, జైలు ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లుగా జిల్లా జైలులో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఉద్యోగం చేస్తూనే కష్టపడి చదివి సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు.


చైర్మన్‌ను కలిసిన కమిషనర్

కైలాస్‌నగర్: ఇటీవల ఆదిలాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన ఎండీ.ఖమర్ అహ్మద్ శనివారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపీడీవోను సన్మానించిన మిత్రులు

బోథ్: బోథ్ ఎంపీడీవో రమేశ్‌ను గురుకుల పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు శనివారం శాలువాతో సత్కరించారు. తమ విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడటంపై గురువు రవికుమార్ సంతోషం వ్యక్తం చేశారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో గురుకుల మిత్రబృందం పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న బ్రహ్మానంద్

గుడిహత్నూర్: మండలంలోని మాన్కూగూడలో కేంద్ర నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ భూమిపూజ చేసి శనివారం పనులు ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జాలీంషా, కొండిబా, మహేష్, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

బోథ్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాలకు మండలంలోని కనుగుట్ట గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని నల్ల రచన ఎంపికకావడంతో నోడల్ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదపు పోశెట్టి విద్యార్థిని అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో జరిగిన క్విజ్ పోటీల్లో మండల స్థాయిలో ప్రథమంగా నిలిచిన ఈదపు అంజిత్, ఎస్‌కె తానిషాలను అభినందించారు.

పూలే దంపతుల సాహిత్యాన్ని చదివి ఉద్యమించాలి

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు రాసిన సమగ్ర సాహిత్యాన్ని బహుజన సాహితీవేత్తలు చదివి సామాజిక న్యాయం కోసం, సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. శనివారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లా వరూడ్ తాలూకా జరూర్‌లో జరిగిన 22వ సాహిత్య సమ్మేళనానికి ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ గురునులే, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ ఉమేష్ రావు ఢోలే, సోషల్ మీడియా ఇన్‌చార్జి మయూర్ మొహార్లే, నిర్వాహకులు శ్రీకృష్ణ బంసోడ్, తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా పంటలు కొనుగోలు చేయొద్దు

జైనథ్: మార్కెట్ కమిటీ జారీ చేసిన లైసెన్స్ లేకుండా సోయాబీన్, పత్తి, కందులు, శనగ వంటి పంటలు కొనుగోలు చేయవద్దని జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కమిటీ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలి

ఖానాపూర్: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడంతోపాటు రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీడీపీవో సరిత అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. రెండు యాప్‌లలో ఎప్పటికప్పుడు బరువు, ఎత్తు నమోదు చేయాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన అలేఖ్యకు అంగన్‌వాడీ టీచర్లు నివాళులర్పించారు. సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.

వివేకానందుని బోధనలు ఎంతో అవసరం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్: స్వామి వివేకానంద రామకృష్ణ మఠం స్థాపించి 125 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శ్రీరామకష్ణ సేవా సమితి ఆదిలాబాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వివేక జ్యోతి పోటీ పరీక్షలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సేవాసమితి కార్యాలయంలో శనివారం నిర్వహించిన పోటీలకు మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హాజరయ్యారు. సేవా సమితి అధ్యక్షుడు ఆరే.భూమన్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నేటి విద్యార్థులకు వివేకానందుని బోధనలు ఎంతో అవసరమని బలమే జీవనం, బలహీనతే మరణం, పవిత్రంగా ఉండడం, ఇతరులకు మంచి చేయడం ఇదే అన్నిమతాల సారం అన్నారు. విద్యార్థులు స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కోరెడ్డి. లెనిన్, జాయింట్ సెక్రటరీ నెల్ల లసమయ్య, సభ్యులు హన్మాండ్లు, శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు పీఆర్టీయూ జనరల్ సెక్రటరీ కుడాల రవీందర్, నర్సింహులు, కోడిమేల మధు, సంగీత పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



బేల: కేక్ తినిపిస్తున్న నాయకులు

నేరడిగొండ/గుడిహత్నూర్/బేల/ తలమడుగు/ ఇంద్రవెల్లి: నేరడిగొండ మండలంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. పలు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ రాథోడ్ సజన్ మాట్లాడుతూ కేసీఆర్ ఆధ్వర్యంలో అన్నిరంగాల ప్రజలు అభివృద్ధి చెందారని అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బేల మండల కేంద్రంలో జెడ్పీటీసీ అక్షిత సతీష్‌పవార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు, పాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు.

'కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది'



కేక్ కట్ చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం గర్వగంగా ఉందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వమిచారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కేఆర్‌కే కాలనీ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర శ్రేయస్సుకు విశేష సేవలను అందించి పేదల ఉన్నత విద్యకు బాటలు వేశారని కొనియాడారు.

పాఠశాలలో మాక్ జెడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థులు

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నమూనా జెడ్పీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమ్మక్క సారక్క జాతరకు లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. దీని వల్ల రద్దీ చాలా ఉంటుంది. ప్లాస్టిక్ వినియోగం పెరుగుతుంది. పర్యావరణ హితంగా జాతరను నిర్వహించడంపై భక్తులను చైతన్య పరచడం కోసం విద్యార్థులు మాక్ జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్, కలెక్టర్, జెడ్పీటీసీల పాత్ర గురించి విద్యార్థులు వివరించారు. ఈ సమావేశంలో విద్యార్థులు పలు తీర్మానాలు చేశారు.

- మేడారం జాతరను పర్యావరణ హితంగా జరుపుకోవడం.
- వీలైనంత వరకు జంతువుల బలిని తగ్గించి అమ్మ వారికి ఇష్టమైన బంగారాన్ని (బెల్లం) మాత్రమే మొక్కుగా సమర్పించడం.
- ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేలా ప్రోత్సహించడం.
- ప్లాస్టిక్ వస్తువుల, ప్లాస్టిక్ సంచులను కట్టడి చేయడం.
- తాగునీటి వసతి, స్నాన ఘట్టాల దగ్గర నీటిని పొదుపుగా వాడుకోవాలి.
- మరుగుదొడ్లను, మూత్రశాలల నిర్వహణ.
- అత్యవసర వైద్య సదుపాయం కోసం 50 చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

ఈ అంశాలపై పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్ రావ్, ఉపాధ్యాయులు లలిత, రాజేందర్, వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న సంగెపు బొర్రెన్న

బేల: రాష్ట్ర ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రెన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పాటన్ గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు ఏనుగు లక్ష్మారెడ్డి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ ఫైజుల్లాఖాన్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా అతివృష్టి, అనావృష్టి కారణంతో ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో కుంగిపోయి రైతు ఏనుగు లక్ష్మారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. 194 జీవో ప్రకారంగా రూ. 6 లక్షల పరిహారం బాధిత కుటుంబానికి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రైతులు వికాస్, నర్సారెడ్డి, దిగాంబర్, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మరణం బాధాకరం



పరామర్శిస్తున్న జాదవ్ రాంకిషన్ నాయక్

నార్నూర్: మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన ఆడే ప్రవీణ్ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఇటీవల కాటారం మండలంలోని నస్తుడిపల్లి అటవీ ప్రాంతంలో జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగల తగిలి మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ జనరల్ మేనేజర్ పరిశ్రమలశాఖ జాదవ్ రాంకిషన్ నాయక్ అన్నారు. శనివారం కానిస్టేబుల్ తల్లి ఆడే నిర్మలబాయి, భార్య లలితబాయిలను పరామర్శించారు. ఆడే ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొసర్, దామెర కనకారావు, జాదవ్ కైలాస్, ప్రేమ్‌సింగ్, బానోత్ రామారావు, తదితరులు ఉన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేస్తున్న పీవీటీజీ ఏపీవో భాస్కర్

బేల: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం కబడ్డీ జట్టుకు మహిళ ఉపాధ్యాయురాలు కుమ్ర సుమిత్ర రూ.6,500 విలువ గల స్పోర్ట్స్ డ్రెస్, మైండ్ స్పార్క్ బ్యాగులు, తదితర క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ ఏపీవో భాస్కర్, హెచ్‌ఎం కొడప జ్యోతిరామ్, ఉపాధ్యాయురాలు శ్వేతరెడ్డి, రమేష్, కాంతరావు, శేష్‌రావు, జైపాల్, పీఈటీ గులాబ్, తదితరులు పాల్గొన్నారు.